


వీవీఎం రిజిస్ట్రేషన్ గడువు పెంపు

గుజరాతీపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజ్ఞాన్ మంతన్ (వీవీఎం) 2025-26 ఆన్‌లైన్ టాలెంట్ టెస్టుకు సంబంధించి పేర్ల రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్లు వీవీఎం జిల్లా కో ఆర్డినేటర్ ఎ.పున్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ సైన్స్ మ్యూజియం, భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో ఈ టాలెంట్ టెస్ట్ జరగనుందని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల అభ్యర్థన మేరకు, ప్రకృతీ వైపరీత్యాలు, అర్ధ సంవత్సర పరీక్షలు, పండుగలు దృష్ట్యా వీవీఎం రిజిస్ట్రేషన్ల గడువును పెంచినట్లు తెలిపారు.



రుణాలు చెల్లిస్తున్నా.. ఇళ్లు ఇవ్వట్లే!



- ఎనిమిదేళ్లుగా టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూపు
- లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు

పలాస, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సొంతింటి కోసం వారు ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్నారు. రుణాలు చెల్లిస్తున్నా వారికి గృహాలు ఇవ్వడం లేదు. సొంత గూడు లేక అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నారు. ఒకపక్క రుణభారం.. మరోపక్క అద్దె భారంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ పలాసలోని టిడ్కో గృహ లబ్ధిదారుల పరిస్థితి. 2014-2019లో టీడీపీ ప్రభుత్వం పట్టణంలోని పేద, మధ్య తరగతి ప్రజల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ముందుగానే లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి బ్యాంకుల నుంచి రుణం ఇప్పించింది. అనం తరం ఆ డబ్బులను ప్రభుత్వం తీసుకుని గృహ నిర్మాణాలు ప్రారంభించింది. పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీకి సంబంధించి పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో మొత్తం 50 ఎకరాలు సేకరించి, అందులో 1,980 గృహాలు నిర్మించడానికి చర్యలు తీసుకుంది. అందులో 980 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్లను నిర్లక్ష్యం చేసింది. రివర్స్ టెండర్ల పేరుతో గృహ నిర్మాణాలను ఆపేసింది. అప్పటికే లబ్ధి దారులను గుర్తించడం, వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం జరిగిపోయింది. లబ్ధిదారులు గతంలో చెల్లించిన డీడీలను తిరిగి ఇచ్చేస్తామని, వారికి ఉచితంగా గృహ నిర్మాణం కోసం స్థలం కేటాయిస్తామని వైసీపీ నేత లు నమ్మబలికారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ తతంగమే నడిచింది. అప్పటికే నిర్మాణం (మిగతా 4వ పేజీలో..)



పనులు 2,467 పూర్తయినవి 696

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జల్‌జీవన్ పనులు ఇలా..

- జిల్లాలో జల్‌జీవన్ మిషన్ తీరిదీ
- మ్యాచింగ్ గ్రాంట్ విడుదలలో వైసీపీ నిర్లక్ష్యం
- దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తిగా పడకేశాయి. ఏనియోజకవర్గంలో కూడా కనీస స్థాయిలో పనులు జరగలేదు. 2,467 పనులు మంజూరైతే కేవలం 696 పనులే పూర్తయ్యా యంటే ప్రగతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణం. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీ రు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను ప్రకటించింది. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన నీరు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రాష్ట్ర ప్రభుత్వంతో సం యుక్తంగా ఈ పనులు చేపట్టాలని నిర్ణయిం చింది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం కేంద్రంతో సమానంగా మ్యాచింగ్ గ్రాంట్ విడు దల చేయకుండా జాప్యం చేసింది. ఆ ప్రభావం పనులపై పడింది. జిల్లాలో ఏ నియోజకవ ర్గంలో కూడా పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌పై దృష్టిసారించి మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయడంతో పనులకు మోక్షం కలగనుంది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. దీంతో పనులు పట్టాలెక్కించేందుకు అధికారు లు ప్రయత్నిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 2,467 పనులు గతంలో మంజూరయ్యాయి. ఆమదాలవలసలో 271 పనులకు గాను 91, ఎచ్చెర్లలో 224కు గాను 85, నరసన్నపేటలో 438కి గాను 104, పలాసలో 247కుగాను 48, పాతపట్నంలో 348కుగాను 134, శ్రీకాకుళంలో 279కుగాను 120, టెక్కలి నియోజకవర్గంలో 373 పనులకుగాను (మిగతా 4వ పేజీలో..)

ఆ వస్తువులే వారి ఆస్తి

- ఇత్తడి, కంచు బిందెలు, చెంబులకు పూజలు
- నువ్వలరేవులో కొనసాగుతున్న సంప్రదాయం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆచారాలు, సంప్రదాయాలకు నిలయంగా నువ్వలరేవు గ్రామం నిలుస్తోంది. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఇత్తడి, కంచు బిందెలు, చెంబులను తమ ఆస్తిగా ఈ గ్రామస్థులు భావిస్తుంటారు. దసరా, సంక్రాంతి లాంటి పెద్దపండుగల సమయంలో ఇళ్లలోని అటుకులు, బల్లలపై ఉన్న ఆ వస్తువులను కిందకు దించుతారు. వీధిలో ఉన్న అమ్మలక్కలను పిలిచి చింతపండు, కర్రల బుగ్గితో కలిపి చక్కగా వాటిని తోముతారు. తరువాత పండుగ నాడు వాటిని పూజించి తిరిగి అటుకులపై పేర్చుతారు. తమ పెద్దల నుంచి వచ్చిన ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ గ్రామస్థులు కొనసాగిస్తుండడం విశేషం. పెళ్లిలకు ఆడపిల్లవారు ఇత్తడి, కంచు సామాన్లను తమ శక్తికొలదీ సారెగా ఇస్తుంటారు. భూములు కొనుగోలుపై ఈ గ్రామస్థులు అంతగా ఆసక్తి చూపరు. బంగారం, ఇత్తడి, కంచు సామగ్రిని కొనుగోలు చేయడానికి ఇష్టపడడం వీరి ప్రత్యేకత. ప్రస్తుతం దసరా సందర్భంగా నువ్వలరేవులో ఏ వీధిలో చూసినా ఇత్తడి, కంచు సామాన్లతో పాటు వారిని తోముతున్న మహిళలే కనిపిస్తున్నారు.



ఇత్తడి, కంచు సామాన్లు తోముతున్న మహిళలు



తోమిన వాటిని అరుగులపై ఆరబెట్టిన దృశ్యం



కొత్తటీచర్లకు శిక్షణ తప్పనిసరి


- పూర్తి చేసిన వారికే నియామక ఉత్తర్వులు
- స్పష్టం చేసిన విద్యాశాఖ డైరెక్టర్
- జిల్లాలో 3 నుంచి ప్రారంభంకానున్న శిక్షణ

నరసన్నపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఇటీవల ఎంపికైన కొత్త టీచర్లకు శిక్షణ తప్పనిసరి అని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అన్నారు. శిక్షణ పూర్తిచేసిన తర్వాతే వారికి నియామకపు ఉత్తర్వులు జారీ చేస్తామని ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నూతన ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభంకానుంది. ఏదైనా కారణంతో శిక్షణకు మినహాయింపు కోరితే అనుమతించాలని, వారి కోసం తర్వాత మళ్లీ శిక్షణ ఇస్తామని ఆయన అన్నారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో (మిగతా 4వ పేజీలో..)

నాలుగు కేంద్రాల్లో..

మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో ఎంపికైన 534 మంది కొత్త టీచర్లకు ఈ నెల 3 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో రవికుమార్ తెలిపారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విశ్వవిజేత జూనియర్ కళాశాల, గ్లోబల్ స్కూల్, గొంటి వీధి మున్సిపల్ స్కూల్‌తో పాటు మరొక పాఠశాలలో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ కేంద్రాలకు ఉదయం ఏడు గంటలకే చేరుకోవాలన్నారు. ఆయా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నేడు విజయనగరం జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక



విజయనగరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం విజయనగరం జిల్లాకు వస్తున్నారు. దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పేదలకు పింఛన్ల ను పంపిణీ చేస్తారు. అనంతరం వారితో ముఖాముఖిలో పాల్గొంటారు. టీడీపీ శ్రేణుల తోనూ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లను మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లు మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఇతర అధికారులతో కలిసి చర్చించారు. సీఎం పర్యటనకు సంబంధించిన మ్యాప్‌ను కూడా మంత్రులు పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు.

పైడిమాంబకు ఘటాభిషేకం



ఘటాలతో పైడితల్లి ఆలయానికి వెళ్తున్న భక్తులు

విజయనగరం రూరల్/ కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబకు మంగళవారం భక్తులు ఘటాభిషేకం చేశారు. పసుపు, కుంకుమ, వివిధ సుగంధద్రవ్యాలతో కలిపిన నీటిని బిందె/మట్టి కుండలో (ఘటాలు) ఉంచి తమ, తమ ప్రాంతాల నుంచి బయలుదేరి ముర్రాటలు సమర్పించారు. జొన్నగుడ్డి, లంకాపట్టణం, హుకుంపేట, శాంతినగర్, ఇప్పిలివీధి, సంతపేట గొల్లవీధి,గవరవీధి, బూర్లెపేట, కొత్త గవరవీధి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా వచ్చారు. దీంతో నగరంలోని అంబటిసత్తర్వు జంక్షన్, మూడు లాంతర్లు, కోట, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, కాంప్లెక్స్ రోడ్డులో ఎటూ చూసినా భక్త జన సందోహమే కనిపించింది. ఊరేగింపులో విచిత్ర వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పైడిమాంబ సిరిమానోత్సవానికి వారం రోజులు మాత్రమే గడువు ఉంది.

రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా 'విభూది'



వెంకట చంద్రసూరిబాబు

శ్రీకాకుళం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు కార్పొరేషన్లకు డైరెక్టర్లను ప్రభుత్వం మంగళవారం నియమించింది. ఈమేరకు జాబితాను విడుదల చేసింది. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలికి ఇరవై మంది డైరెక్టర్లను నియమించింది. శ్రీకాకుళం నగరానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త, జంగమ సాధికారిక సమితి నాయకుడు విభూది వెంకట చంద్రసూరిబాబుకు డైరెక్టర్‌గా అవకాశం దక్కింది. తనకు అవకాశం కల్పించిన టీడీపీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ నాయకులకు చంద్రసూరిబాబు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా దుర్గాదేవికి పూజలు 4లో



ఈ-సిగరెట్లతో జాగ్రత్త

- పొగరాదని వాడితే ఆరోగ్యానికే ముప్పు
- పీలిస్తే క్యాన్సర్ బారినపడే ప్రమాదం
- జ్ఞాపకశక్తి కోల్పోయే ఆస్కారం
- వినియోగిస్తూ పట్టుబడితే మూడేళ్ల జైలు





అరసవల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పబ్‌లు, పార్టీల్లో చాలామంది ఎలక్ట్రానిక్ సిగరెట్లను పీల్చుతున్నారు. వాసన లేకపోవడం, పొగరాకపోవడం వల్లన ఆరోగ్యానికి పెద్దగా ప్రమాదం లేదనే అపోహతో ఈ-సిగరెట్లను వినియోగిస్తున్నారు. నిజానికి ఎలక్ట్రానిక్ సిగరెట్ల ద్వారా పొగ రాకపోయినా ఆర్యోగానికి ముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్యాటరీ ఆధారిత పరికరంతో ఈ-సిగరెట్లను తయారు చేస్తారు. ఈ పరికరంలో నికోటిన్ ద్రవరూపంలో ఉంటుంది. రుచి, వాసన కోసం ఇతర రసాయనాలు వినియోగిస్తారు. పరికరంలో ఉండే ఆటోమైజర్.. నికోటిన్ ద్రవాన్ని వేడిచేసి ఆవిరిగా మారుస్తుంది. ఇవి విడుదల చేసే ఆవిరిలో 2.5 పీఎం కంటే చిన్న రేణువులు ఉంటాయి. దీన్ని పీల్చడం వల్లన ఊపిరితి త్తులు, గుండె సంబంధిత సమస్యలు వస్తా యని, నాడీ వ్యవస్థ, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, కొన్నిసార్లు జ్ఞాపకశక్తి కోల్పో యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దంతాలు, నోటి ఆరోగ్యం దెబ్బతింటుంది. ఈ-సిగరెట్ల తయారీ, దిగు మతి, ప్రకటనలు, అమ్మకం, వినియోగాన్ని దేశంలో నిషేధించారు. కానీ, చాలామంది యువత పార్టీల్లో వీటిని విరివిగా వినియోగించి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నా రు. ఈ-సిగరెట్లను వినియోగిస్తూ మొదటిసారి పట్టుబడితే ఒక సంవత్సరం జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా ఉంటుంది. రెండోసారి పట్టుబడితే మూడేళ్ల (మిగతా 4వ పేజీలో..)

అనారోగ్యం తప్పదు



ఈ-సిగరెట్లతో పొగరాదని, ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవని చాలామంది అపోహ పడుతుంటారు. అది నిజం కాదు. వీటి వినియోగంతో అనారోగ్యం తప్పదు. గుండె, ఊపిరితిత్తుల సంబంధిత తదితర సమస్యలు తలెత్తుతాయి. హృద్రోగులు, గర్భిణులు, యువత వీటికి కచ్చితంగా దూరంగా ఉండాలి.

-డాక్టర్ అన్నెపు శశిధర్, ఎండీ (జనరల్ ఫిజీషియన్)

'ఉపాధి'లో అక్రమాలకు చెక్ 6లో
- ఆధార్‌తో శ్రామికుల అనుసంధానం
- ఒకరికి బదులు మరొకరు పని చేయడం కుదరదు
- కొత్త మార్గదర్శకాలు జారీ

సొంతింటి కలను నెరవేర్చడమే ధ్యేయం 6లో
- వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

వైభవంగా దుర్గాదేవికి పూజలు

దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాల్లో అమ్మవారిని మంగళవారం దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్నిచోట్ల దుర్గమ్మ సన్నిధిలో కుంకుమ పూజలు చేశారు. జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లను భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకొని.. ప్రత్యేక పూజలు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


అరసవల్లి: దుర్గమ్మగా సంతోషిమాత


జలుమూరు: సారవకోట మండలంలోని అవలింగిలో ...


నరసన్నపేట: ఉర్లాంలో శాకంబరిగా దుర్గమ్మ


శ్రీకాకుళం: బొందిలీపురంలో దుర్గమ్మగా దర్శనమిచ్చిన తుల్జా భవాని


శ్రీకాకుళం రూరల్: చింతాడలో సామూహిక కుంకుమ పూజలు


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో చిన్నారుల నృత్యం


కంచిలి: దుర్గమ్మగా కంచమ్మ


ఎచ్చెర్ల: సాయుధ పోలీసు క్వార్టర్స్ సమీపంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం


నందిగాం: నీలమణి ఆలయం వద్ద పూజలు చేస్తున్న మహిళలు


పలాస: షిర్డీసాయిబాబా ధ్యానమందిరంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


సంతబొమ్మాళి: చెట్లతాండ్రలో కుంకుమ పూజలు


జలుమూరు: శ్రీముఖలింగంలోని వారాహి సన్నిధిలో...


ఆమదాలవలస: దుర్గాదేవి మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కోట చిన్నబాబు@ 103



టెక్కలి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలోని వ్యక్తి టెక్కలికి చెందిన కోట చిన్నబాబు. ఆయన 103 ఏళ్ల వయస్సులో కూడా తన పనులు తాను చేసుకుంటూ ఉంటారు. ఆయన శాకాహారి. ఉదయాన్నే అరలీటరు పాలు, మధ్యాహ్న భోజనంలో కందిపప్పు, నెయ్యి, సాయంత్రం పూట వేరుశనగ గుడ్లు ఆయన ఎక్కువగా తీసుకుంటారు. 85 ఏళ్ల వయస్సు వరకు నిత్యం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండేవారు. ప్రతిరోజూ దినపత్రికలను మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు చదువుతారు. రామాయణం, మహాభారతం వంటి పుస్తకాలను ఖాళీ సమయాల్లో చదువుకుంటుంటారు. చిన్నబాబుకు 103 ఏళ్లు. ఆయన ఆరోగ్య రహస్యం ఏమిటని ప్రశ్నిస్తే.. ఆహారపు అలవాట్లే ఇప్పటి వరకు కాపాడాయని తెలిపారు. నాడు పల్లెటూరుల్లో పేడ గత్తంతో పండే కాయగూరలు, ధాన్యం, చెక్కగానుగుల నూనెలు, సమృద్ధిగా లభించే పాలు, మజ్జిగ, నడక వంటివి తన జీవితానికి ఎంతగానో ఉపకరించాయన్నారు. నేడు ఏ వస్తువు కొన్నా కల్తీ అన్నారు. ఎరువులు, పురుగు మందులతో పండించే పంటలు.. మనం తినే ఆహారం అంతా కల్తీ మయం అవతోందన్నారు.

కొత్త టీచర్లకు శిక్షణ తప్పనిసరి

(మూడో పేజీ తరువాయి)

కొత్తవారిని నియమిస్తామని తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా ఏదైనా పాఠశాలకు చెందినఉపాధ్యాయులంతా బదిలీలు కోరి.. ఇంకా రిలీవర్ రాని కారణంగా అక్కడే పనిచేస్తుంటే, అలాంటి చోట కొత్తవారిని మొదట నియమించాలని ఆదేశించారు. కేటగిరీ 3,4 ప్రాంతాల్లోనే ప్రాధాన్యత క్రమంలో నియమించాలని విజయరామరాజు ఆదేశించారు. సెప్టెంబరు 30 నాటికి ఖాళీలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలను అప్‌లోడ్ చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

నేడు ఎంఈవోలతో సమావేశం..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు డీఈవో రవికుమార్ తెలిపారు. మండలాల్లో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలకు సంబంధించిన వివరాలతో ఎంఈవోలు రావాలని ఆయన ఆదేశించారు. 3,4 కేటగిరీ ప్రాంతాల్లో ఖాళీలు, అలాగే పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేని పాఠశాలలను గుర్తించాలని అన్నారు.

ఈ-సిగరెట్లతో జాగ్రత్త

(మూడో పేజీ తరువాయి)

జైలు శిక్ష, రూ.5లక్షల జరిమానా విధిస్తారు. పొగతాగడాన్ని మానివేసేందుకు చాలామంది ఈ-సిగరెట్లను ఒక ప్రత్యామ్నాయంగా భావిస్తుంటారు. కానీ, ఇది చాలా తప్పు. ఈ-సిగరెట్లు కాల్చడం సరదాగా మొదలై, చివరకు అలవాటుగా మారి అనారోగ్యానికి దారి తీస్తుంది. పట్టుబడితే జీవితాలు నాశనమైపోతాయి. అందుకే యువత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

రుణాలు చెల్లిస్తున్నా గృహాలు ఇవ్వట్లే!

(మూడో పేజీ తరువాయి)


పిచ్చిమొక్కలతో నిండిపోయిన టిడ్కో పరిసరాలు

పూర్తి చేసుకున్న గృహాలకు నీలం రంగు పూయడం తప్ప ఆ ప్రభుత్వం చేసిందేమీ లేదు. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం టిడ్కో గృహ నిర్మాణాలు తామే ప్రారంభించామని, తామే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని ప్రకటిం చింది. దీంతో లబ్ధిదారులంతా ఆనందంలో మునిగితేలారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా టిడ్కో ఇళ్ల నిర్మాణం ఊసే లేదు. వచ్చే ఏడాది జూన్‌లో గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని అసెంబ్లీలో మంత్రి నారాయణ చేసిన ప్రకటన తప్ప దీనిపై స్పష్టమైన హామీ ఏదీ దొరక్కపోవడంతో లబ్ధిదారులు ఆం దోళన చెందుతున్నారు. ప్రస్తుతం టిడ్కో గృహ నిర్మాణ ప్రాంతం అడవిని తలపిస్తోంది. ప్రధాన మార్గాల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. గోడలకు తీగ చెట్లు అల్లుకుపోయా యి. పాత భవనాలు మాదిరిగా దర్శనమిస్తున్నాయి. పక్కా రహదారి ఒక్కటి కూడా నిర్మాణం జరగలేదు. విద్యుత్, తాగునీరు సదుపాయాలు లేవు. మురుగుకాలువలు పూర్తిగా నిర్మాణానికి నోచుకోలేదు. మొత్తం పనులు పూర్తి చేయాలంటే కనీసం ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. ఇక్కడున్న నిర్మాణం పరిస్థితిని చూసి లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. బ్యాంకులకు ప్రతినెలా వడ్డీలతో సహా రుణం చెల్లిస్తున్నా టిడ్కో గృహాలు సొంతంకాకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా టిడ్కో గృహాలను పూర్తి చేసి తమకు అందించాలని కోరుతున్నారు.

పనులు 2,467.. పూర్తయినవి 696

(మూడో పేజీ తరువాయి)

54 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇటీవల కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సమీక్షించిన తరువాత పనులు వేగవంతం అయ్యాయి. ఎక్కడికక్కడే స్థానిక ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవాలు చేశారు.

● ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా 287 పనులు పూర్తిచేయాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ పూర్తయిన పనులు కేవలం 60 మాత్రమే. ఇంకా 227 పనులు వివిధ స్థితిలో ఉన్నాయి. నియోజకవర్గంలో 4 మండలాలు ఉంటే కేవలం సోంపేట మండలంలో అధికారులు పనులు చేయించి చేతులు దులుపుకొన్నారు. ● ఇప్పటికే ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు రూ.700 కోట్లతో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం పనులు జరుగుతున్నాయి. వంశధార నదికి కుడివైపులా ఉన్న పాతపట్నం, పాలకొండ నియోజకవర్గాలకు సైతం తాగునీటిని ఇదే ప్రాజెక్టు ద్వారా విస్తరించేందుకు నిర్ణయించారు. టెక్కలి, నరసన్నపేట ని యోజకవర్గాలకు తాగునీరు అందించే వీలుగా సారవకోట మండలం బొంతు వద్ద ఒక ప్రాజెక్టును ఏర్పాటుచేయను న్నారు. అలాగే శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలగాను సరుబుజ్జిలి మండలం వెన్నలవలస వద్ద ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

ఈ నరకం ఇంకెన్నాళ్లు..?

- రోజుల తరబడి ఇలాగేనా..
- ఇదీ నగరంలోని డీసీసీబీ కాలనీ దుస్థితి

అరసవల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డులోని డీసీసీబీ కాలనీకి వెళ్లాలంటేనే వామ్మో అనే పరిస్థితి ఎదురవుతోంది. దశాబ్దాల కిందట ఏర్పడిన ఈ కాలనీలో కనీసం కాలువల నిర్మాణం లేకపోవడంతో వర్షం కురిస్తే చాలు రోజులు, వారాల తరబడి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. చినుకు పడితే చాలు వారి గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. ఈ నరకం నుంచి ఎప్పటికి విముక్తి అనేది తెలియక వారు తెల్లముఖం వేస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఈ కాలనీకి ఆనుకుని మరికొన్ని కాలనీల దుస్థితీ ఇలాంటిదే. ఇటీవల కాలంలో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎప్పుడు కాలనీ రోడ్లు బాగుంటాయో ఎప్పుడు నీటితో నిలిచిపోయి ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. వారాల తరబడి మురుగు నీరు రోడ్లపై నిలిచిపోయి దుర్గంధంతో పాటు వ్యాధులు ప్రబలుతున్నాయన్న ఆవేదన నుస్థానికులు వ్యక్తం చేస్తున్నారు. తామంతా క్రమం తప్పకుండా ఇంటి, కుళాయి పన్నులు చెల్లిస్తున్నా మా సమస్యలను పరిష్కరించడంలో నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం కిందట కురిసిన వర్షానికి అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఎదురుగా ఉన్న రోడ్డులో వర్షపు నీరు నిలిచి పోయింది. నిత్యం మోకాలు లోతు నీటిలో నడిచి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నా మని ఆవేదన చెందుతున్నారు. అధికారులు వచ్చి చూసి వెళ్లారు తప్ప ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదని వారు పేర్కొంటున్నారు. రోడ్డు మలుపులో ఏర్పా టు చేసిన విద్యుత్తు స్తంభాల చు ట్టూ నీరు చేరి బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లు తోంది. ఇప్పటి కైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించడంతోత పాటు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిపోయిన నీటిలో భయం.. భయంగా నడక


రోడ్డు పక్కన దుర్గంధంగా తయారై

పన్నెండేళ్లుగా వేడుకుంటున్నాం

కాలనీలో ఇళ్లు నిర్మించుకుని 12 ఏళ్లుగా నివాసిస్తున్నాం. వర్షం పడితే వారాల తరబడి నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. ఇంటి గేటు బయటకు వచ్చేందుకు కూడా ఇబ్బందే. నిత్యం మునిసిపల్ అధికారులకు విన్నవిస్తూనే ఉన్నాం. అయినా మార్పు లేదు. గత వారం రోజులుగా నీటిలోనే ప్రయాణిస్తున్నాం. సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుందో తెలియడం లేదు.

-కోరాడ నారాయణ గుప్త, రిటైర్డ్ హెచ్‌ఎం

రోడ్లు నాచుపట్టాయి..

ఆమదాలవలస, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మునిసిపాలిటీ పరిధిలోని కొన్ని రోడ్లు దారుణంగా ఉన్నాయి. కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు, వర్షపునీరు రోజుల తరబడి రోడ్లపై నిలిచి నాచు పట్టి దారుణంగా తయారయ్యాయి. దీంతో ఈ రోడ్లపై నుంచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహదాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతుంటే బాటసారులు జారిపడి గాయాలబారిన పడుతున్నారు. పట్టణంలోని 12వ వార్డు చంద్రయ్యపేటలో ఇదే పరిస్థితి నెలకొంది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు ఉత్పత్తి చెంది జ్వరాల బారిన పడుతున్నామని, అలాగే దుర్గంధంతో ఇక్కట్లకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చంద్రయ్యపేటలో నాచుపట్టిన రహదారి

న్యూస్ బాక్స్

తిరుమలలో 'వావిలపల్లి' ప్రసంగం

పొందూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలానికి చెందిన ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత వావిలపల్లి రాజారావు మంగళవారం ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆహ్వానం మేరకు తిరుమలలోని ఆస్థాన మండపంలో అన్నమయ్య కీర్తనలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు సత్కరిం చారు.

కిడ్నీ వ్యాధితో యువతి మృతి

కవిటి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సహలాలపుట్టుగ గ్రామానికి చెందిన అంజలి ప్రధాన్(28) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. నాలుగేళ్లుగా ఈ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. అప్పులు చేసి వైద్యం అందించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. ఈమె తల్లిదండ్రులు గ్రామంలో పాన్‌షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉండగా ప్రస్తుతం కుమార్తె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు.

సొంత నిధులతో లైట్ల ఏర్పాటు

ఇచ్ఛాపురం,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డు బెల్లుపడకాలనీలో ఎట్టకేలకు వీధి లైట్ల సమస్య పరిష్కారమైంది. ఐదు స్తంభాలకు లైట్లు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అనేక పర్యాయాలు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదు. దీంతో టీడీపీకి చెందిన స్థానిక నాయకుడు శాసన శేఖర్ తన సొంత నిధులతో 5 ఎల్‌ఈడీ బల్బులను కొనుగోలు చేసి స్తంభాలకు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేసి ఆయనను అభినందించారు.

మెడికల్ కాలేజీల పీపీపీ విధానం వద్దు

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం తగదని వైసీపీ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ పీపీపీ విధానంలో చేపట్టడం సరికాదన్నారు. దీనివల్ల పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండల పరిధి పెద్దపాడు ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పెద్దపాడుకు చెందిన బొట్ట సూర్యనారాయణ (65) స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులకు వెళుతూ రోడ్డు క్రాస్ చేస్తుండగా శ్రీకాకుళం నుంచి పెద్దపాడు వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.రాము తెలిపారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో వారంతా లబోదిబోమంటున్నారు.

చికిత్స పొందుతూ మరో వృద్ధుడు..

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడు వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న సుమారు 60 ఏళ్ల వ్యక్తి మంగళవారం మృతిచెందాడని రూరల్ ఎస్‌ఐ బి.రాము తెలిపారు. ఈనెల 17న పెద్దపాడులో అపస్మారక స్థితిలో ఉన్న సదరు బిచ్చగాడిని స్థానికులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఇతని వివరాలు తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.


మృతి చెందిన బిచ్చగాడు

ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో చోరీ

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో సోమవారం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రణస్థలంలో ఐసీఐసీఐ బ్యాంకులో సేల్స్ అధికారిగా పనిచేస్తున్న అరసవిల్లి ఝాన్సీ భర్త కానిస్టేబుల్ రవితో కలిసి కాలనీలో ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. ఆమె ఈనెల 27న రాత్రి ఇంటికి తాళం వేసి కన్నవారి గ్రామం ముగతంపాలెం వెళ్లి తిరిగి సోమవారం రాత్రి ఇంటికి చేరుకునే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసి చోరీ జరిగిందని గుర్తించారు. మంగళవారం ఉదయం శ్రీకాకుళం రూరల్ పోలీసులకు సమాచారం అందజేయగా వారు ఘటనా స్థలానికి చేరుకు ని వివరాలు సేకరిం చారు. 2 తులాల బంగారం, జత పట్టీలు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. క్లూస్ టీం పరిశీలించింది. ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

విద్యుత్ చార్జీల తగ్గింపు దసరా కానుక

అరసవల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల తగ్గింపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు దసరా, దీపావళి కానుక అందించారని సొండికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెమలిపురి కోటేశ్వర చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్రలో ప్రభుత్వాలు చార్జీలను పెంచడమే తప్ప తగ్గించడం ఇంతవరకు చూడలేదని, ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో మరింత భారం తగ్గించాలని ఇప్పటికే ప్రణాళిక వేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం 9 సార్లు చార్జీలు పెంచి తే కూటమి ప్రభుత్వం ఆ చార్జీలను తగ్గించడం ఆనందదాయకమన్నారు. 5 ఏళ్ల వైసీపీ పాలనలో రూ.125 లక్షల కోట్ల అప్పులతో విద్యుత్ రంగాన్ని దివాళా తీయించిందన్నారు. చార్జీల తగ్గింపుతో ప్రజలకు దసరా, దీపావళి ముందుగానే వచ్చాయని పేర్కొంటూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టాభమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


కోలాటం ఆడుతున్న మహిళలు

ఆమదాలవలస, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గం పరిధి బూర్జ మండలం లక్కుపురం గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత పట్టాభమ్మ అమ్మవారిని దర్శించి చల్లదనం చేశారు. గ్రామంతో పాటు పనుకుపర్త, వై.పర్త గ్రామాలకు చెందిన ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. విశాఖపట్నానికి చెందిన మహిళలు కోలాట ప్రదర్శన చేశారు.

ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణ

అరసవల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చని డీఆర్వో ఎం.వేంక టేశ్వరరావు అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రథ మ చికిత్సపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్య వసర సమయాల్లో ప్రాణాలను కాపేందుకు ఫస్ట్ ఎయిడ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరికీ దీనిపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా అధ్య క్షుడు జగన్మోహనరావు, డా.కె.సుధీర్, బి. చిన్నయిరావు, నర్సింగరావు, గుణాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు

4, 5 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలు అక్టోబరు 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నామని, వీటిని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం ఇచ్ఛాపురంలో సంఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగాల శ్రీను, బి.హైమవతి, రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ స్థలం పరిరక్షణకు చర్యలు


కంచె ఏర్పాటు చేసి బోర్డు పెట్టిన దృశ్యం

పొందూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జోగన్నపేట సమీపంలో ఉన్న పీఏసీఎస్ స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు గాను మంగళవారం స్థలానికి చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. గతంలో పీఏసీఎస్‌కు చెందిన కొంత స్థలాన్ని జోగన్నపేటకు చెందిన వ్యక్తి ఆక్రమించాడు. దీంతో రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసినట్లు సీఈవో వై.పాపి నాయుడు తెలిపారు. కంచె ఏర్పాటు ప్రక్రియను టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి, డైరెక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షించారు.

సక్రమంగా గ్రామసభలు నిర్వహించాలి

శ్రీకాకుళం లీగల్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్టోబరు 2 నుంచి గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉంగటి వెంకట రమణ, కుమిలి రాజేష్ కోరారు. ఈ మేరకు పుణ్యపువీధిలోని ఐక్యవేదిక కార్యాలయంలో కోర్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామసభలకు అనేక చోట్ల అధికారులు గైర్హాజరవుతున్నారని, అటువంటి వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎల్.ధర్మారావు, రమేష్, బీవీ రమణమూర్తి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐవో దుర్గారావు ఉద్యోగ విరమణ

శ్రీకాకుళం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శ్రీకాకుళం రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి(ఆర్‌ఐవో) ప్రగడ దుర్గారావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ నిర్వహణలో 42 ఏళ్ల పాటు పలు హోదాల్లో విధులు నిర్వహించి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఆయన శేష జీవితం ఆనందంగా గడపాలని జిల్లా అధికారులు, పలు కళాశాలల యాజమాన్యాలు కోరారు. ప్రస్తుతం డీవీఈవోగా విధులు నిర్వహిస్తున్న రేగ సురేష్‌కుమార్ ఇకపై ఆర్‌ఐవోగా పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్‌ఏసీ)లతో వ్యవహరించనున్నారు.

ప్రమాదకరంగా మలుపులు


మూల సవలాపురం సమీపంలో ఉన్న మలుపు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో సవలాపురం జంక్షన్ వద్ద యరగాం వరకు ఉన్న మార్గంలో పలు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూల సవలాపురం సమీపంలో కామినాయుడు చెరువు వద్ద ఉన్న రెండు మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతో ఎదురెదురుగా దగ్గరకు వచ్చే వరకు వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇదే మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించకపోవడంతో ఎంఎస్‌పురానికి చెందిన దివ్యాంగుడు జొన్నాడ నందేష్ ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలో ప్రమాదవశాత్తూ పడి మృత్యువాత పడ్డాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్యుల వినతి


ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైద్యులు

ఆమదాలవలస, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారుల సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గం పరిధిలోని వైద్యాధికారులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కూన రవి కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సరు బుజ్జిలి, పురుషోత్తపురం, బూర్జ, గుత్తావల్లి, అక్కులపేట, తొగరాం, దూసి, పట్టణంలోని పలు అర్బన్ ఆరో గ్య కేంద్రాల వైద్యులు ఎమ్మెల్యేని శ్రీకాకుళంలోని ఆయన స్వగృ హంలో కలిసి సమస్యలను విన్నవించారు. వైద్యవృత్తిలో ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో స్థిరపడాలన్న మా ఆలోచనకు ప్రభుత్వం విధించిన నిబం ధనలు ఇబ్బందిగా ఉన్నాయన్నారు. గ్రామీణ పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్న మా సమస్యలను వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యుల నిరసన

అరసవల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులకు జరుగు తున్న అన్యాయాలకు వ్యతిరేకంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట వైద్యులు నిరసన తెలిపారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, టైమ్‌బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, సంచార చికిత్స కార్యక్రమానికి నెలకు రూ.5 వేలు ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు 43 పతకాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆచార్య నాగార్జున వర్సిటీ మైదానంలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొని 43 పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. 17 బంగారు, 14 రజితం, 12 కాంస్య పతకాలు సాధించినట్లు టీమ్ కోచ్ కమ్ మేనేజర్ ఇ.అప్పన్న, రామయ్య పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎన్.జయ్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.మధుసూదనరావు, ఎం.సాంబమూర్తి, సభ్యులు బీవీ రమణ, కె.మాధవరావు, టి.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.


నడక పోటీలో విజేతగా నిలిచిన శృతి

నడక పోటీలో విజేత శృతి

కవిటి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిన్నమెళియాపుట్టుగకి చెందిన ఎం.శృతి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలో విజేతగా నిలిచింది. గుంటూరులో జరిగిన పోటీల్లో ఐదు కిలో మీటర్ల నడక పోటీలో ప్రథమస్థానం పొందింది. ఈమె కవిటి ప్రభు త్వ జూనియర్ కళాశాలలో చదువుతోంది. రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవడంపై ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆమెను అభినందించారు. అలాగే కవిటి ఎస్‌వీజేలో డిగ్రీ చదువుతున్న కె.శిరీష మూడు వేల మీటర్ల స్టెప్లెచేజ్ పోటీలో పతకం సాధించి నట్లు కరస్పాండెంట్ బీవీ ప్రసాదరావు తెలిపారు. ఆమెను సిబ్బంది అభినందించారు.

తీరం పొడవునా తాటిచెట్లు పెంచాలి


మత్స్యకారులతో అటవీశాఖ ఉన్నతాధికారులు

సోంపేట రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరం పొడవునా తాటిచెట్లు పెంచి సంరక్షించాలని రాష్ట్ర అటవీశాఖ చీఫ్ వైల్డ్ వార్డెన్, అడిషనల్ పీసీసీఎఫ్ శాంతి ప్రియపాండే అన్నారు. బట్టి గల్లూరులో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్‌లో భాగంగా తాటి వనాలను పెంచడం, ప్రకృతి విపత్తులు, సైక్లోన్, సునామీ నుంచి తీర ప్రాంతాలను రక్షించడంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో ప్రసన్న, కాశీబుగ్గ రేంజర్ మురళీకృష్ణ నాయుడు, సెక్షన్ ఆఫీసర్ బిందుమతి, బీట్ ఆఫీసర్ టి.సంతోష్‌కుమార్, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.





ఓఆర్ పెరిగి.. బస్సులు రద్దీగా మారి

● స్త్రీశక్తి పథకంతో పెరిగిన 75 శాతం మహిళా ప్రయాణికులు ● దసరా నేపథ్యంలో కిటకిటలాడుతున్న బస్టాండ్లు


నరసన్నపేట బస్టాండ్‌లో పాతపట్నం వెళ్లే బస్సు ఎక్కుతున్న మహిళలు

నరసన్నపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, పాతపట్నం, సోంపేట తదితర ఆర్టీసీ బస్టాండ్లలో దసరా సందడి కనిపిస్తోంది.దూరప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకుంటుండడంతో ప్రయాణికులతో బస్టాండ్లల్లో రద్దీ నెలకొంది.విద్యాసంస్థలకు సెలవులు తర్వాత ఒక్కసారిగా వారం రోజుల్లో ఓఆర్ పెరిగింది. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణసౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. పల్లెవెలుగులు, అల్ట్రా పల్లెవెలుగులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో 75 శాతం మహిళ ప్రయాణికుల ఆక్యూపెన్సీఉందని ప్రజారవాణాఅధికారులు చెబుతున్నారు.శ్రీకాకుళంనుంచి టెక్కలి, పాతపట్నం, పలాస,హిరమండలం, కొత్తూరు, విశాఖ, విజయనగరం, పొందూరు తదితర మార్గాల్లో బస్సులు రద్దీగా ఉంటున్నాయి. దసరా ఉత్సవాలు నేపథ్యంలో మహిళలు పాతపట్నం,కోటబొమ్మాళి, పాలకొండ తదితర ప్రాంతాల్లోని నీలమణితల్లి,కొత్తమ్మతల్లి, కోటదుర్గమ్మ ఆలయాలను దర్శించుకునేందుకుపెద్దసంఖ్యలో వస్తుండడంతోబస్టాండ్లు రద్దీగా మారుతున్నాయి.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి దుర్మరణం

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో మంగళవారం ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాధం నెలకొంది.

వ్యాన్ ఢీకొని బాలుడు..


యశ్వంత్‌కుమార్ (ఫైల్)

జి.సిగడాం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం వంతెన సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జి.సిగడాం పోలీసుల కథనం మేరకు.. పొందూరు మండలంలోని ఇల్లయ్యగారిపేటకు చెందిన కొంచాడ యశ్వంత్‌కుమార్ (15) మేనమామ, కృష్ణాపురానికి (గారపేట) చెందిన కెల్ల వెంకటేష్‌తో కలిసి ధవళపేటలోని స్నేహితుడి వద్దకు బైక్‌పై వెళ్తున్నారు. ఆనందపురం వంతెన సమీపంలో వెనుక నుంచి వచ్చిన వ్యాన్‌ఢీకొనడంతో బైక్‌పై వెనుక కూర్చొన్న యశ్వంత్‌కు గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్‌కి తీవ్ర గాయాలు కావడంతో 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.యశ్వంత్‌కుమార్ తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మృతుడి అక్క యోగి లక్ష్మి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు.ఇల్లయ్యగారి పేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి శవపంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రామకృష్ణ తెలపారు.

బస్సు ఢీకొని యువకుడు..


లక్ష్మీనారాయణ (ఫైల్)

మెళియాపుట్టి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఓ ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ పిన్నింటి రమేష్‌బాబు కథనం మేరకు.. మంగళవారం మండలంలోని చాపర గ్రామానికి చెందిన నాగవశం లక్ష్మీనారాయణ (39)మెళియాపుట్టి వైపు నడుచుకొని వస్తున్నాడు. అదే సమయంలో పలాస నుంచి పర్లాకిమిడి వెళ్తున్న ప్రైవేటుబస్సు పోలీస్‌స్టేషన్ సమీపంలో లక్ష్మీనారాయణను ఢీకొంది. దీంతో ఆయన అక్కడక్కడే మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదుచేశారు.

తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

సంతబొమ్మాళి, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టవానిపేట సముద్రతీరానికి మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. ఎస్‌ఐ వై.నర్సింహమూర్తి కథనం మేరకు.. మృతదేహం బాగా ఉబ్బిపోయిఉంది. కొద్దిరోజుల కిందట ఎక్కడో మృతి చెంది కెరటాల తాకిడికి ఇక్కడకు చేరి ఉండవచ్చని మత్స్యకారులు చెబుతున్నారు. మృతుడు నలుపు డ్రాయర్, కుడి చేతికి స్టీల్ కడియం ధరించి ఉన్నాడు. ఎస్‌ఐ వై.నర్సింహమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.ఈ మేరకు కేసు నమోదు చేశారు.

వంశధార నదిలో మహిళ గల్లంతు

హిరమండలం,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమనాపల్లికి చెందిన రావాడజయమ్మ(53) వంశధారనదిలో గల్లంతయింది. గ్రామస్థులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామానికి సమీపంలోగల వంశధార నది వద్దకు ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జయమ్మ వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనచెందారు. గ్రామంలో వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో వంశధార నది వద్దకు వెళ్లి వెతికారు. నది ఒడ్డున ఆమె చెతి కర్ర కనిపించడంతో స్నానానికి దిగి గల్లంతై ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు. ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

దారి అడిగి.. గొలుసు లాక్కెళ్లారు

● నాలుగు తులాల బంగారం గొలుసు స్వాధీనం ● ఇద్దరు అరెస్ట్

సోంపేట, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి):మహిళ మెడలో ఇటీవల బంగారం గొలుసు చోరీకేసులో ఇద్దరిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ బి.మంగరాజు తెలిపారు. సోంపేటలో బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఈనెల 14న ఉదయం 11 గంటల సమయంలో కవిటి మండలంలోని దూగానపుట్టుగకి చెందిన ఎంపల్లి జానకి భర్తతో కలిసి మందసలో ఉన్న అల్లుడిని పిలుపు చేసేందుకు పలాస వైపు హైవేపైవెళ్తున్నారు. ఆసమయంలో కొర్లాం-పాలవలస మధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు సిల్వర్‌కలర్ హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చి శ్రీకాకుళానికి దారిఅడిగి ఆమె మెడలోఉన్న గొలుసును బలవంతంగా తెంపుకొని వెళ్లిపోయారు.ఈఘటనపై బాధితులు బారువ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్‌ఐ హరిబాబునాయుడు హైవేపైఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. మంగళవారం ఉదయం 10.30 సమయంలో కొర్లాం వద్ద ఉన్న సీసీకెమెరాలు పరిశీలిస్తుండగా సిల్వర్‌కలర్ హెల్మెట్‌తో అనుమానాస్పదంగా ఉండే వాహనాన్ని గుర్తించారు. వెంటనే పోలీస్ తనిఖీ చేపట్టే సమయంలో పోలీసులను చూసి నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా చాకచక్యంగా పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు పాత్రపురానికి చెందిన మురళీశెట్టి, రంజాన్ సాహుగా గుర్తించి అరెస్ట్ చేశారు. వీరివద్ద నుంచి నాలుగు తులాల బంగారం గొలుసును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో ఒడిశా గొలంతరలో రెండు, బరంపురంలో ఓ కేసు నమోదుకాగా వీరిద్దరు ఫిబ్రవరి నుంచి జూలై వరకు జైల్లో ఉన్నారు. గొలుసు చోరీ ఘటనపై బారువ పోలీసులు వెంటనే స్పందించి నిందితులను పట్టుకోవడంతో ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

21 మద్యం సీసాల స్వాధీనం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అల్లినగరం కోనేరుకు సమీపంలో మంగళవారం మద్యం విక్రయిస్తున్న ఆముజోల శంకరరావును అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన వద్ద నుంచి 180 ఎంఎల్ సామర్థ్యం గల 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అఖిన్‌ఖాన్‌పేట శివారులో మంగళవారం పేకాటఆడుతున్న తొమ్మిదిమందిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.5,000 నగదుతోపాటు రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

సోషల్‌మీడియాలో సీఎం పట్ల వ్యాఖ్యలపై ఫిర్యాదు

పలాస, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుపై అవహేళన చేస్తు సోషల్‌మీడియాలో వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర, డొక్కర శంకర్, ఎ.రామకృష్ణ, బి.ఉమాకాంత్, చంద్రశేఖర్‌త్యాడి కోరారు.ఈ మేరకు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణకు మంగళవారం ఫిర్యాదుచేశారు.ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీపట్టణాధ్యక్షుడు శిష్టు గోపి సీఎంను అవహేళన చేస్తు, అసత్యాలను అసభ్యకరరీతిలో ప్రచారంచేస్తున్నారని తెలిపారు. జంటపట్టణాల్లో అశాంతి వాతావరణం ప్రేరేపించే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని, వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు చేయాలి

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో కె.సింహాచలం తెలిపారు. లక్ష్మీనర్సుపేట సమీపంలోని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుచేసుకోకపోతే పంటల రాయితీలు వర్తించవని చెప్పారు.

‘ఉపాధి’లో అక్రమాలకు చెక్

● ఆధార్‌తో శ్రామికుల అనుసంధానం ● ఒకరికి బదులు మరొకరు పనిచేసేందుకు ఇక చెక్ ● కొత్త మార్గదర్శకాలు జారీ

గారరూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కొత్తమార్గదర్శకాలను రూపొందించింది.ఇకపై ఉపాధి శ్రామికులను ఈ-కేవైసీ ద్వారా ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. ఒకరి బదులు మరొకరు పనిచేసే అవకాశానికి చెక్‌పడనుంది.ఈ విధానం బుధవారం నుంచి కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. అయితే ఈ విధానానికి సంబంధించి విధి విధానాలను అన్ని జిల్లాలకు పంపించారు. ఇప్పటికే ఉపాధి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.గతంలో కొందరు ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పనిచేసేవారు. ఇకపై అలా చేయడానికి వీలుఉండదు.కూలీలకు ఆధార్‌నంబరుతో అనుసంధానంచేసి ఈ-కేవైసీ తీసుకోనున్నారు. దీంతో ఒకరికి బదులు ఇంకొకరు హాజరైతే యాప్ అనుమతించదు.జిల్లాలో 4,39,000 జాబ్‌కార్డులకు గాను సుమారుగా 7,26,000 మంది శ్రామికులు పనులకు హాజరవుతున్నారు. వీరిలో జాబ్‌కార్డులున్న పలువురు పనులకు రావ ట్లేదు. వారికి బదులు ఇతరులు పనులు చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. డబ్బులు జాబ్‌కార్డు ఉన్నవ్యక్తి ఖాతాలో జమవుతున్నాయి.ఆ డబ్బులను క్షేత్రస్థాయి సిబ్బంది శ్రామికులు పంచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం నుంచి సర్క్యులర్

తొలుత రాష్ట్రంలో రెండు జిల్లాలో ఈవిధానం ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నట్లు డుమాపీడీ బి.సుధాకరరావు తెలిపారు. అయితే అన్ని జిల్లాల్లో ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి సర్క్యులర్ వచ్చిందని చెప్పారు. జాబ్‌కార్డు ఉన్న వారు మాత్రమే పని కల్పించడంతోపాటు వేతనం అందజేయనున్నట్లు చెప్పారు.ఈ ప్రక్రియకు సంబంధించి ఏపీవోలకు ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. ఈకేవైసీ, ఆధార్ అనుసంధానం నిబంధనల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు.

నేడు అచ్చెన్న పర్యటన

టెక్కలి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్‌బంకును మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ఉదయం ప్రారంభించనున్నారు. అనంతరం బన్నువాడలో సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో దుర్గా శరన్నవరాత్రి వేడుకల్లో పాల్గొంటారని మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు తెలిపారు.

నేడు క్విజ్ పోటీలు

నందిగాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మద్దిలివానిపేటలో సరస్వతీదేవి పూజల్లో భాగంగా బుధవారం నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని,ఒక్కోపాఠశాల నుంచిరెండు టీమ్‌లకు అర్హత ఉంటుందని పేర్కొన్నారు.

క్విజ్ పోటీ విజేత హరిదాసుపురం

కణితివూరులో సరస్వతీదేవిపూజా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన క్విజ్‌పోటీల్లో హరిదాసుపురం ఉన్నత పాఠశాల ప్రథమస్థానంలో నిలిచింది. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 14 టీములు పాల్గొనగా హరిదాసుపురం విజేతగా నిలవగా, ద్వితీయ, తృతీయ స్థానాలు పూండిగోవిందపురం వివేకానంద, చిన్నబడాం సాయిశిరీష పాఠశాలలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

166 మందికి వైద్య పరీక్షలు

హరిపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):హరిపురం సీహెచ్‌సీలో స్వస్తి నారీ-స్వసస్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 166మంది మహిళలు, గర్భిణులకు వైద్యరక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ స్వరాజ్యలక్ష్మి, గౌరీశంకర్, సాలిన భీమారావు, సుశీల, వైద్యులు బాలకృష్ణ, రమేష్‌నాయుడు,జ్ఞానేశ్వరి,షన్ముఖరావు పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చడమే ధ్యేయం

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, 21మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.23లక్షల చెక్కులను మంత్రి పంపిణీచేశారు. అంగన్‌వాడీ సహాయకులుగా ఎంపికైన ఆరుగురుకి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతప్రభుత్వం ఇళ్లపట్టాల కోసం భూముల కొనుగోలులో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. శ్మశానాలు, డంపింగ్ యార్డులు పక్కనఉన్న, నివాసయోగ్యంకాని, వర్షంవస్తే మునిగిపోయే భూములను రెండింతల, మూడింతలుగా అధిక ధరలకు ప్రభుత్వంతో కొనిపించారని తెలిపారు. రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవాడికి అర్బన్‌లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున్న ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, వెలమల కామేశ్వరరావు పాల్గొన్నారు.కాగా నిమ్మాడలోని గ్రామదేవతకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల కోసం పక్కా ఏర్పాట్లు చేయండి

● నీలమణి దుర్గ ఆలయాన్ని పరిశీలించిన పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్


నీలమణిదుర్గ ఆలయం పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంజీఆర్

పాతపట్నం,సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):దసరారోజున వాహనాల పూజల కోసం వచ్చే భక్తులకోసం పక్కా ఏర్పాట్లుచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. జిల్లాలోని అధికసంఖ్యలో వాహనాలు, దూరప్రాంతాల నుంచి భక్తులతాకిడి అధికంగా ఉండనుండడంతో పటిష్టమైన ఏర్పాట్లుచేయాలని దేవదాయ,పోలీస్‌శాఖఅధికారులను ఆదేశించారు.మంగళవారం పాతపట్నంలోని నీలమణి దుర్గ ఆలయంలో దసరా నేపథ్యంలో అమ్మవారి పూజల నిర్వహణ, భక్తుల కోసం ఏర్పాట్లను పరిశీలించారు.ఆయన వెంటపైల బాబ్జీ, శివాల చిన్నయ్య, సైలాడ సతీష్, ఆలయ చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, ఈవో వాసుదేవరావు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యేతామరలో చెవిటమ్మతల్లిని దర్శించుకున్నారు. ఇక్కడ జరిగిన కొమ్మలయాత్ర ఉత్సవం, యాటల కార్యక్రమంలో పాల్గొన్నారు.

వసతిగృహాన్ని తరలించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట లక్ష్మీనగర్‌లో ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిసున్న కళాశాల బాలుర బీసీవసతిగృహం తరలించాలని కాలనీవాసులు యు.కేశవరావు, రామదాసు, చలపతిరావుకోరారు.జనావాసాల్లో వసతిగృహం ఏర్పాటు చేయడంతో ఇబ్బంది పడుతున్నామని మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. వసతిగృహంలో చదివే ఇంటర్, డిగ్రీ విద్యార్థులు రోడ్డుపై గొడవలు చేస్తున్నారని,దీంతో మహిళలు ఇబ్బంది పడుతుండడంతో ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు.

క్విజ్‌లో సత్తాచాటిన శ్రీకృష్ణ సాహితీ హైస్కూల్ విద్యార్థులు

కాశీబుగ్గ, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని చిన బాడాంలోగల శ్రీకృష్ణసాహితీ హైస్కూల్ విద్యార్థులు క్విజ్ పోటీల్లో సత్తాచాటారని కరస్పాండెంట్ కవిటి భారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో నిర్వాహకులు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మందస మండలంలోని సువర్ణాపురంలో గతనెల 27న నిర్వహించిన మెగా క్విజ్ పోటీల్లో 40కి పైగా బృందాలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. వీటిలో 12 మంది ఎంపిక చేయగా తమ పాఠశాల విద్యార్థులు మెయిన్ క్విజ్‌లో ప్రథమ,ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారని తెలిపారు.అలాగే వజ్రపుకొత్తూరు మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురంలో గతనెల 29న నిర్వహించిన జిల్లాస్థాయి వ్యక్తిగత ప్రతిభా పరీక్ష పోటీల్లో 300మందిపాల్గొనగా ప్రథమ,ఆరో స్థానాలను తమ పాఠశాల విద్యార్థులు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేడమే కాకుండా వారికి అవసరమైన మెటీరియల్ అందజేస్తున్నామని తెలిపారు


శ్రీకృష్ణ సాహితీ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే బగ్గు


నరసన్నపేట: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేసున్నాయని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలం తెలిపారు. మంగళవారం నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో స్వస్త్‌నారీ - స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఆరోగ్యసేవలను, రక్తదానంశిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీహెచ్ కళ్యాణబాబు, ఏరియా ఆసుపత్రి సూపపరింటెండెంట్ శ్రీనివాసబాబు, అడ్వయిజర్ నిక్కు పద్మావతి, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు, మార్కెట్ చైర్‌పర్సన్ పి.ఉమామహేశ్వరి, చింతు పాపారావు, గొద్దు చిట్టిబాబు, ఉణ్న రాజశ్రీ, పుచ్చల కల్పన పాల్గొన్నారు.

యువకులు రక్తదానం చేయాలి

పోలాకి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) యువకులు ముందుకు వచ్చి రక్తదానాన్నిచేసి మరో ప్రాణాన్ని నిలబెట్టాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. మంగళవారం మొగిలివిల్లిపేటలో నీలమణిదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు పురస్కరించుకుని రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి సొసైటీ చైర్మన్ బైరి భాస్కరరావు, నాయకులు పప్పల ధర్మారావు, బోర వెంకటరమణ, బట్న రాము పాల్గొన్నారు.

మరమ్మతులు లేక.. మూలకు చేరి

●పలాస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వృథాగా పడిఉన్న జనరేటర్


పొదల్లో ఉన్న జనరేటర్

పలాస రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):పలాస తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జనరేటర్ పొదల్లో వృథాగా పడిఉంది.2015లో జనరేటర్‌ను పాత తహసీల్దార్ కార్యాలయం అవసరాలకోసం వినియోగించేవారు.ఆరేళ్లకిందట పాడవ డంతో మరమ్మతులకు నోచుకోకపోవడంతో మూల కుచేరింది. నూతన భవనంలోకి మారిన తర్వాత జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకురాలేదు. లక్షలాదిరూపాయల ప్రజాధనంతో అత్యవసర సమయంలో పనులు నిలిచిపోకుండా ఉండేందు కు కొనుగోలుచేసిన జనరేటర్‌ను నిరుప యోగంగా విడిచిపెట్టడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

‘స్త్రీశక్తి’తో రూ.51కోట్ల భారం

● అప్రెంటీస్ పోస్టుల భర్తీకి చర్యలు

● ఆర్టీసీ ఈడీ బ్రహ్మనందరెడ్డి


ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

టెక్కలి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం వల్ల నెలకు రూ.51కోట్ల భారం పడుతోందని ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బస్సుల్లో ఆక్యుపెన్సీ పెంచాలని కోరారు. మంగళవారం టెక్కలి ఆర్టీసీ డిపోను ఈడీ పరిశీలించారు. అనంతరం సిబ్బందితో డిపోకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు జిల్లాల్లో 19 డిపోలకు గాను 1,610 బస్సులు ఉన్నాయని, ఇందులో 1,332 బస్సులు స్త్రీశక్తి పథకానికి వినియోగిస్తున్నావని తెలిపారు. ఆగస్టు 14న 4లక్షల 16వేలు మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకోగా, గతనెల29న 8లక్షల39వేల మంది మహిళలు వినియోగించుకున్నారని చెప్పారు. ఆర్టీసీ పరిధిలో పలు అప్రెంటీస్ పోస్టులు ఖాళీగా ఉండడంతో వాటి భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, డీఈఈ రవికు మార్, డిపో మేనేజర్ శ్రీనివాసరావులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పత్రి కొమ్మల పూజ


లింగాలవలసలో గ్రామదేవత సన్నిధిలో పత్రి కొమ్మలకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

జలుమూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాయిపేట, లింగాలవలస, పెద్దదూగాం తదితర గ్రామాల్లో పత్రి కొమ్మలతో గ్రామదేవతలకు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించారు. దుర్గాష్టమి పురస్కరించుకొని గ్రామదేవతలకు చల్లదనం చేశారు. పత్రికొమ్మలు గ్రామదేవత సన్నిధిలో వరుసక్రమంలో ఉంచి పూజలు చేసి అనంతరం పంట పొలాల్లో వేసుకున్నారు.

పదోన్నతులు లేక.. వేతనాలు చాలక

●నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ ● ఇదీ జిల్లాలోని వీఆర్‌ఏల పరిస్థితి


వజ్రపుకొత్తూరులో నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు (ఫైల్)

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు (వీఆర్‌ఏలు)పదోన్నతులు లేక, వేతనాలు చాలక అగచాట్లకు గురవుతున్నారు. నాలుగో తరగతి ఉద్యోగాలుగా గుర్తించి వేతనం పెంచాలని డిమాండ్‌ను పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని ఆ సంఘ నాయకులు వాపోతున్నారు. రూ.11 వేలు వేతనంతో కుటుంబాన్ని ఏ విధంగా పోషించాలో అధికారులు, నాయకులే చెప్పాలని వారు పేర్కొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహించి వీఆర్‌ఏలను ఎంపిక చేశారు.ఎంపికచేసిన సమయంలో నెలకు రూ.ఆరువేలు వేతనం అందజేసేవారు.టీడీపీ ప్రభుత్వం వీరు జీతం రూ.పది వేలకు పెంచింది. ఆ తర్వాత డీఏ ఇతర అలవెన్స్‌ల పేరుతో వీరు నెలకు అందుకుంటున్న వేతం రూ.. 11వేలు వరకు మాత్రమే జీతం అందుతోంది. గ్రామంలో ప్రతి పనిని వీఆర్‌ఏ పరిశీలించాలి.తహసీల్దార్ కార్యాయంలో ఏ చిన్న కార్యక్రమం జరిగినా వీఆర్‌ఏలు మొదటి నుంచి చివరి వరకూవిధులు నిర్వహించాలి. గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రారంభిం చిన తర్వాత వీరులేనిదే పనులు ముందుకు సాగడంలేదు. ఉద్యోగాలకు ఎంపికై 11 ఏళ్లు గడుస్తున్నా కనీసం వేతనం అందడంలేదని జిల్లాలో 110 మంది వీఆర్‌ఏలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగోతరగతి ఉద్యోగుల మాదిరిగా వేతనం చెల్లిస్తామని మొదట ప్రకటించినా ఇంత వరకు ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదని వీఆర్‌ఏ సంఘ నాయకులు వాపోతున్నారు.వేతనాలు పెరగక, ప్రమోషన్లు లేక తీవ్రమానసిక వేదనకు గురుతున్నట్లు తెలిపారు. తమ తర్వాత ఎంపికైన సచివాలయ ఉద్యోగలకు అన్ని వసతులు కల్పించిందని, అన్నిరకాల సేవలందిస్తున్న తమ విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై వీఆర్‌ఏలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వేతనం చాలకపోవడంతో కొన్నిసార్లు ఉద్యోగం విడిచిపెట్టాలన్న ఆలోచన వస్తుందని, కానీ ప్రభుత్వం ఏదో ఒకరోజు తమకు శుభవార్త చెబుతుందన్న ఆశతో పనిచేస్తున్నామని పలువురు వీఆర్‌ఏలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఏ సంఘ నాయకులు కోరుతున్నారు.